# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :85 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 24-05-2024 | పేజీలు:4 వెల: 2.00


## శ్రీ గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

తిరుపతి,మే23: శ్రీ గోవిందరాజస్వామి వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన గురువారం ఉదయం ఆలయ అధికారులు అంగరంగ వైభవంగా స్వామివారికి రథోత్సవం నిర్వహించారు. రథోత్సవం కర్ణాల వీధి, బేరి వీధి, గాంధీ రోడ్డు మీదుగా తిరిగి ఆలయ రథమండపం వరకు సాగింది. ఈ ఉత్సవంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు గోవిందనామస్మరణతో రథాన్ని లాగారు. అలాగే 10గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ గోవిందరాజ స్వామి వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనాన్ని నిర్వహించారు. తిరుపతి శ్రీ గోవిందరాజస్వామి వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు ఈ నెల 15వ తేదీ సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. కాగా విశాఖ శారదపీఠం పీఠాధిపతి స్వరూపానంద స్వామి.. తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ సంవత్సరం చాలా అద్భుతాలు జరుతాయన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని స్వామి వారిని ప్రార్థించానని స్వరూపానంద స్వామి తెలిపారు.

# వ్యవసాయ మంత్రిపై హరీశ్‌రావు ఫైర్..



హైదరాబాద్,హరీష్ రావు వడ్లకు బోనస్ ఏమైందని అడిగితే.. వ్యవసాయ మంత్రి కొందరు మొరుగుతున్నారంటూ రైతులను కుక్కలతో పోలుస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం పూడూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు బ్యాండ్ పేపర్‌పై రాసిచ్చి.. వడ్లకు బోనస్ ఇస్తామని ఇవాళ సన్నాహాలకు ఇవాళ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ఆ రోజు మీరు రాసిచ్చిన బ్యాండ్ పేపర్‌పై సంతకాలు పెట్టారు కదా? ఈ రోజు పీసీసీ అధ్యక్షుడు, భట్టి విక్రమార్క సంతకాలు పెట్టారు. మీరు సంతకాలు పెట్టి.. నమ్మబలికి బ్యాండ్ పేపర్లు ఇచ్చి.. చేతుల్లో పట్టుకొని ఇవాళ వడ్లకు బోనస్ ఏమందంటే చేతులెత్తేస్తున్నారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

సన్నాసులకు మీరు బోనస్ ఇచ్చేది ఏందీ..?

'ఎందుకు ఇవ్వరు బోనస్'? ఇవాళ జగిత్యాల జిల్లాలో రైతులతో, వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడితే జిల్లా పరిధిలో 2.97లక్షల ఎకరాల్లో యాసంగిలో వడ్ల పండితే.. 2.80లక్షల ఎకరాల్లో దొడ్డు వడ్లే ఉన్నాయి. మిగితా 17వేల ఎకరాల్లో సన్నాలు సాగు చేశారు. అవి కూడా ఇంటిమందం సన్నాలు తిండిగింజల కోసం సాగు చేశారు. దానికి మీరు బోనస్ ఇచ్చేది ఏందీ? లక్ష్మారెడ్డి అనే రైతుతో మాట్లాడితే మా జగిత్యాలలో జైశ్రీరామ్ అనే సన్నవడ్లకు బయట రూ.2800-రూ.3వేలు కొనుగోలు చేస్తున్నారు. గవర్నమెంట్ ఇచ్చేదిఏందీ? ప్రైవేటులోనే కొనుగోలు చేస్తున్నారు. అందువల్ల రూ.500 కోసం ప్రభుత్వానికి అమ్మనే అమ్మరు. ఇదంతా మోసం ఉన్నది అని రైతు లక్ష్మారెడ్డి చెబుతూ వాపోతున్నారు. నిజానికి దొడ్డ రకమైతే 25-30 క్వింటాళ్లు పండుతయ్. సన్నైతే రకాలు 10-15 క్వింటాళ్లు పండుతయ్. దాదాపు పది క్వింటాళ్ల వరకు దిగుబడి తక్కువ. రోగాలు, పెట్టుబడి, నెలరోజుల కాలం ఎక్కువ. మన ప్రాంతంలో రైతులు పండించేది రూపాయికి 90 పైసలు దొడ్డ రకమే ఎక్కువ. మరి సన్నాలకు బోనస్ చేయడం అంటే.. రైతులను మోసంచేయడం, దగా.. రైతుల గుండెలపై తన్నడం తప్ప ఇంకోటి లేదు' అన్నారు.

మిమ్మల్ని గెలిపించి ఇందుకేనా..?

'బాధ కలిగించే విషయం ఏంటంటే వ్యవసాయశాఖ మంత్రి అంటారు. మరి రైతులు కూడా మొరుగుతున్నట్టేనా? ఈ రైతులే చెబుతున్నారు ఈ కాంగ్రెస్ గవర్నమెంట్ మమ్మల్ని మోసం చేస్తోంది. అంటే ఇవాళ రైతులను అ వమాన పరుస్తున్నారు. మీరిచ్చిన మాట అమలు చేయండంటే.. మొ రుగుతున్నరు అని మాట్లాడుతున్నారు.. రైతులను కుక్కలు అంటున్నారా? మీరు. ఒక మంత్రి ఏమో రైతుబంధు ఎప్పుడు ఇస్తరు అంటే చెప్పుతో కొడుతా అంటాడు. అయ్యా వడ్లకు ఎప్పుడు బోనస్ ఇస్తారు.. ఇది మోసం అంటే.. రైతులను పట్టుకొని కుక్కలతోపోలుస్తూ మొరుగుతున్నారు. మిమ్మల్ని ఇందుకేనా గెలిపించింది ? అంటూ నిలదీశారు.

రైతుల పోరాటానికి సిద్ధమంటున్నారు..

'రైతులందరూ ముక్తకంఠంతో చెబుతున్నారు. మేమందరం హైదరాబాద్‌కు వస్తాం. పోరాటానికి సిద్ధంగా ఉన్నాం. రూ.500 బోనస్ ఇవ్వాల్సిందేనని చెబుతున్నారు. స్పందించాలి. ఇప్పుడు ఏం అంటారు ? ఇప్పుడు మెల్లగా భవిష్యత్‌లో కొంటాం అంటారు. ఎన్నికలకు ముందు బాండ్‌పేపర్‌పై ఏమని రాసారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. ఇప్పుడు ఏమైందంటే దాటవేస్తున్నారు. ఇది మోసపూరిత ప్రభుత్వం. మొన్న లోక్‌సభ ఎన్నికల సమయంలో డబ్బాలో ఓటుపడేదాకా ఏమీ మాట్లాడలేదు. ఇప్పుడు సన్నాలకే బోనస్ ఇస్తామని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. రైతులను మోసం చేస్తున్నారు. మంత్రులు మేల్కొనాలి. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి' అని డిమాండ్ చేశారు.

# జూన్ 5 తరవాత భారాసా దుకాణం బంద్...

హైదరాబాద్,మే23: ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే జూన్ 5 తర్వాత భారాస దుకాణం మూతపడుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం భారాస నేతలను ఆ పార్టీ కార్యకర్తలే వెంటపడి కొడతారన్నారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర సంపదనంతా దోచుకున్నది చాలక కేసీఆర్ కుటుంబం దిల్లీకి వెళ్లింది. అవినీతి చేయకుండానే భారాస ఎమ్మెల్సీ కవితపై 8 వేల పేజీల ఛార్జిషీట్ దాఖలు చేశారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అప్పుల ఖజానా మాత్రమే ఇచ్చారని మండిపడ్డారు. ఇకపోతే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నోరు అదుపులో పెట్టుకోవాలంటూ కేటీఆర్‌కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. మరోసారి తమ ముఖ్యమంత్రి రేవంత్‌ని తిడితే పరిస్థితి తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. కేటీఆర్ బచ్చా అని.. తండ్రి పేరు చెప్పుకుని మంత్రి అయ్యారని ఎద్దేవా చేశారు. కానీ, రేవంత్ రెడ్డి ఇండిపెండెంట్‌గా గెలిచి లీడర్ అయ్యారని పేర్కొన్నారు. రేవంత్ వయసులో పోలిస్తే కేటీఆర్ చిన్న పిల్లాడు అని వ్యాఖ్యానించారు. సిరిసిల్లలో కేకే మహేందర్ రెడ్డి పొట్ట కొట్టి కేటీఆర్ ఎమ్మెల్యే అయ్యాడని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల రిజల్ట్స్ తరువాత బీఆర్ఎస్ భూస్థాపితం అవడం ఖాయం అని అన్నారు. మేడిగడ్డ మాదిరిగానే బీఆర్ఎస్ పార్టీ కూలిపోవడం ఖాయం అన్నారు. కేసీఆర్ కూతురు కవిత చేసిన పనికి రాష్ట్రం పరువు పోతోందని వ్యాఖ్యానించారు. 5వ తేదీ నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలే కేటీఆర్, హరీష్ రావునితరిమి కొడుతారని అన్నారు. నందినగర్ నుండి కారులో న్యూట్రల్‌లో వెళ్లినా అసెంబ్లీకి చేరుకోవచ్చునని.. కట్టే పట్టుకొని అసెంబ్లీకి రాలేదు కానీ, బీజేపీ కోసం కెసిఆర్ బస్సులో తిరిగారని కేసీఆర్‌పై విమర్శలు గుప్పించారు. అసలు తెలంగాణ కోసం కొట్లాడింది తామేనని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి రెండు మూడు స్థానాల్లో డిపాజిట్ వస్తుందని.. అన్ని స్థానాల్లో ఓడిపోతుందని మంత్రి కోమటిరెడ్డి జోస్యం చెప్పారు. 12 రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ లేకుండా పోతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీకి లీడర్, క్యాడర్ లేకుండా పోతారని అన్నారు. 5వ తేది తర్వాత తెలంగాణ భవన్‌కి తాళం వేసుకోవాల్సి వస్తుందన్నారు. కవితకు బెయిల్ రావట్లేదని కేటీఆర్ పూర్తిగా ఫ్రస్టేషన్‌లోకి వెళ్లారని.. అందుకే ఇష్టారీతిన తమ ప్రభుత్వంపై కారుకూతలు కూస్తున్నారంటూ కేటీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ఇస్తున్నందుకు మా రేవంత్‌ని తిడుతున్నావా? 500 రూపాయలకు సిలిండర్, ఉచిత విద్యుత్ ఇవ్వడమే మేం చేస్తున్న పాపమా? హాస్టల్స్, పేదవారికి ఇచ్చే ఉచిత బియ్యం పూర్తిగా సన్నబియ్యం ఇద్దామనుకోవడం తప్పా? మేం ఇచ్చిన నోటిఫికేషన్ కాంగ్రెస్ క్లెయిమ్ చేసుకుంటుంది అంటున్నావ్. మరి మీరే ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. మా ముందు



చూపుతోనే హైదరాబాద్ అభివృద్ధి జరిగింది. కేసీఆర్ చేసిన పనికి మూడు డ్యాములు కొట్టుకొని పోయే ప్రమాదం ఉందని నిపుణులు చెప్తున్నారు. కాళేశ్వరం పేరుతో కోట్ల రూపాయలు వృధా చేశారు. వైన్ షాపుల పేరు మీద కేసీఆర్ నాన్ రిఫండబుల్ పైసలు గుంజిండు. ఏకకాలంలో రుణమాఫీ చేయబోతున్నాం. మల్లన్నపై కేసులు ఉన్నాయని అంటున్నావ్.. మీ చెల్లిపై 8000 పేజీల ఛార్జ్ షీట్ పై ఏమంటావ్ కేటీఆర్? మహేశ్వర్ రెడ్డి ఏం పైరవీ చేసుకొని పదవి తెచ్చుకున్నారు? ఆయన పేరు పలకాలంటే సిగ్గుగా ఉంది?' అని కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. తెలంగాణ బీజేఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. ఈ డిపార్ట్‌మెంట్‌కి వెళ్లినా మహేశ్వర్ రెడ్డి ఆర్టీఐ అప్లికేషన్లే ఉంటున్నాయని అన్నారు. బ్లాక్ మెయిల్ చేసి పైసలు సంపాదించాలని మహేశ్వర్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి ఆరోపించారు. ఆర్టీఐలు కోరుతున్న మహేశ్వర్ రెడ్డి.. నిర్మల్ నియోజకవర్గానికి ఏం కావాలని ఒక్కసారైనా అడిగారా? అని మంత్రి ప్రశ్నించారు. ఇకపోతే జిల్లాల్లో మున్సిపాలిటీల అనుమతులు లేకుండానే భారాస కార్యాలయాలు నిర్మించారు. ప్రభుత్వ ఆస్పత్రుల భవనాలు 14 అంతస్తులు మించరాదని నిబంధనలు చెబుతున్నాయి. ఎల్బీనగర్ ఆస్పత్రి స్థలానికి ఎన్‌వోసీ లేకుండా నిర్మాణం చేపట్టారు. అందెశ్రీ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించాలని గత ప్రభుత్వాన్ని కోరాం. ఆడిటోరియానికి కాళోజీ పేరు పెట్టాలంటే పెట్టలేదు. నల్గొండ జిల్లాకు ఎస్ఎల్‌బీసీ సొరంగం మంజూరు చేయిస్తే.. భారాస ప్రభుత్వం నిలిపివేసిందని విమర్శలు చేశారు. ఇచ్చిన హామీలను ప్రాధాన్య క్రమంలో నెరవేర్చుకుంటూ వెళ్తున్నామని, వేసవిలో వడగళ్ల వాన కారణంగా పంటనష్టం జరిగితే రైతులకు రూ.1500 కోట్ల పరిహారం చెల్లించినట్లు వెల్లడించారు.

# దేవుడిపై ఒట్లు వేస్తే రైతులకు న్యాయం జరగదు

యాదాద్రి: 45 రోజులు గడుస్తున్న కొనుగోలు ప్రక్రియ పూర్తికాక పోవడం.. కొనుగోలు ప్రక్రియ నత్తనడకన కొనసాగుతుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి. యాదాద్రి జిల్లాలోని బీబీనగర్ మండలం రాఘవపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి పరిశీలించారు. కొనుగోలు ఆలస్యం కావడానికి గల కారణాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియ ఆలస్యం అవుతుందని కిషన్ రెడ్డి దగ్గర రైతులు మొర పెట్టుకున్నారు. ఎప్పటికీ కొనుగోలు పూర్తి అవుతుందో తెలియడం లేదని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ కొనుగోలు ప్రక్రియలో ప్రతి దశకు కేంద్రం డబ్బులు చెల్లిస్తుందని, .. అయినా కొనుగోలు సరిగ్గా జరగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల కక్ష్య పూరితంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు కిషన్ రెడ్డి. సీఎంకు రైతులకంటే ఎన్నికలే ముఖ్యంగా మారింది అని ఆరోపించారు. మాజీ సిఎం కేసీఆర్ గతంలొ వరి వేస్తే ఉరి అన్నారని , ఇప్పుడ సిఎం రేవంత్ రెడ్డి దొడ్డు వడ్లు వేస్తే బొనస్ ఇవ్వము అంటున్నారని



అన్నారు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం అంటే అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో బ్యాంకర్లు రైతులకు రుణాలు ఇవ్వడం లేదన్నారు. దేవుడి మీదు ఒట్టు పెడితే రైతుకు న్యాయం జరగదని రేవంత్ కు చురకలు అంటించారు.

# తెలంగాణ ఆర్టీసీ లోగో సిద్దం కాలేదు: సజ్జనార్



హైదరాబాద్,తెలంగాణలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. టీఎస్ పేరును టీజీగా మారుస్తామని ఇది వరకే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తాజాగా ఇందుకు సంబంధించి ఉత్తర్వులు సైతం జారీ చేశారు. ఇందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం ఈ విజ్ఞప్తిని కేంద్రం సైతం అంగీకరించింది. ఈ మేరకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. దీంతో తెలంగాణలో కొత్త వాహనాల రిజిస్ట్రేషన్లకు టీజీ పేరును ఇస్తున్నారు. ఈ మార్పులతో తాజాగా టీఎస్ఆర్టీసీ పేరును టీజీఎస్ఆర్టీసీగా మార్చారుఇందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రాన్ని సూచించే అధికారిక సంక్షిప్త పదం టీఎస్ నుంచి టీజీగా మారుస్తూ ఇటీవల సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వరంగ సంస్థలు, ఏజెన్సీలు, ఇతర స్వయం ప్రతిపత్తి సంస్థలు, అధికారిక హోదాలు సూచించే బోర్డుల్లో రాష్ట్రాన్ని టీజీగా పేర్కొనాలని సూచించారు. జీవోలు, పాలసీ పేపర్లు, నోటిఫికేషన్లు, సర్క్యులర్లు, లెటర్ హెడ్స్, అధికారిక పత్రాల్లో సైతం టీజీ అని వచ్చేలా చూడాలన్నారు. ఇదిలా ఉంటే తెలంగాణ ఆర్టీసీని టీఎస్ఆర్టీసీగా పిలుస్తున్న విషయం తెలిసిందే. అయితే తెలంగాణ ప్రభుత్వం టీజీగా మార్చడంతో టీఎస్ఆర్టీసీ కూడా టీజీ ఆర్టీసీగా మారుతుందని వార్తలు వచ్చాయి. ఇక ఆర్టీసీ లోగో కూడా మారిపోయిందంటూ సోషల్ మీడియాలో కథనాలు వైరల్ అయ్యాయి. మారిన లోగో ఇదేనంటూ కొన్ని ఫొటోలు కూడా చక్కర్లు కొట్టాయి. అయితే దీంట్లో ఏ మాత్రం నిజం లేదని ఆర్టీసీ ఎండీ సజ్జనర్ క్లారిటీ ఇచ్చారు. లోగో మార్పుపై జరుగుతోన్న ప్రచారానికి సంబంధించి ట్విట్టర్ వేదికగా క్లారిటీ ఇచ్చారుతెలంగాణ ఆర్టీసీ లోగో మార్పు విషయంలో జరుగుతున్న ప్రచారాన్ని ఆ సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ తప్పుబట్టారు. కొత్త లోగో ఇంకా సిద్ధం కాలేదని స్పష్టం చేశారు. ఈ మేరకు తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ పెట్టారు. 'కొత్త లోగో విషయంలో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదు. అధికారికంగా ఇప్పటివరకు కొత్త లోగోను సంస్థ విడుదల చేయలేదు. టీజీఎస్ ఆర్టీసీ కొత్త లోగో అంటూ సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న లోగో ఫేక్. ఆ లోగోతో సంస్థకు ఎలాంటి సంబంధం లేదు. కొత్త లోగోను సంస్థ రూపొందిస్తోంది. కొత్త లోగోను టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం ఇంకా ఫైనల్ చేయలేదు' అని ఆయన పేర్కొన్నారు. ఈమేరకు సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు.

# ఏపీ కొత్త సీఎం ఎవరో రేవంత్ కి తెలిసిపోయిందా ?



హైదరాబాద్,తెలంగాణా సీఎం గా ప్రమాణం చేసిన దాదాపు ఆరు నెలలకు ఏపీకి రేవంత్ రెడ్డి వచ్చారు. నిజానికి ఆయన తిరుపతి మొక్కు అన్నది తీర్చుకుంటారు అని చాలా కాలంగా ప్రచారంలో ఉంది. ఆయన తిరుపతి వస్తారు. అలాగే విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ వార్ని దర్శించుకుంటారు అని కూడా అప్పట్లో ప్రచారం సాగింది. అలా ఏపీకి వచ్చిన సందర్భంగా ఆయన ఏపీ సీఎం జగన్ తో భేటీ అవుతారు అని డేట్ టైమూ కూడా ప్రచారం చేసిన సందర్భాలు ఉన్నాయి.అయితే ఇన్నాళ్ళకు రేవంత్ తిరుపతి వచ్చారు. అయితే ఈ సందర్భం చూస్తే ఏపీలో సీఎం జగన్ కానీ ప్రతిపక్ష నేత చంద్రబాబు కానీ లేరు. ఇద్దరూ విదేశాలలో ఉన్నారు. పైగా ఏపీలో ఎన్నికలు ముగిసి ఆపద్ధర్మ పాలన సాగుతోంది. దాంతో పాటు ఎన్నికల కోడ్ ఉంది. అందువల్ల ఎవరికీ కలవడానికి వీలు లేని వేళ ఇది.దీంతో రేవంత్ రెడ్డి మొక్కు తీర్చుకున్నారు. పూర్తిగా ఆధ్యాత్మిక పర్యటనకే పరిమితం చేశారు. అయితే ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి చేసిన కొన్ని కామెంట్స్ మత్రం వైరల్ అవుతున్నాయి. ఆయన ఏపీ ప్రభుత్వంతో మంచి రిలేషన్స్ కొనసాగిస్తాను అని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాలూ బాగుండాలని కోరుకున్నారు.అంతే కాదు ఏపీలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత తాను మరోసారి వచ్చి ఏపీ సీఎం ని కలుస్తాను రెండు రాష్ట్రాల మధ్య అభివృద్ధి గురించి చర్చిస్తాను అని చెప్పారు. జూన్ 4న ఏపీకి కొత్త సీఎం ఎవరో తేలిపోతుంది. మరి రేవంత్ మదిలో ఎవరు ఉండవచ్చు అంటే సహజంగానే ఏపీ కాంగ్రెస్ నాయకుల మాదిరిగానే ఆయన కూడా టీడీపీ వస్తుందనే భావించవచ్చు అని అంటున్నారు.కాంగ్రెస్ ఎదుగుదల కోసం అయినా వైసీపీ ఓటమి పాలు కావాలన్నది ఆ పార్టీ నేతల మాట. వైసీపీ ఓడితేనే కాంగ్రెస్ క్యాడర్ మొత్తం వెనక్కి వచ్చి ఏపీలో ఆ పార్టీ బలోపేతం అవుతుంది. 2029 ఎన్నికలనే టార్గెట్ గా చేసుకుని ఏపీలో అడుగులు వేయడానికి 2024 ఉపయోగపడుతుందని ఆ పార్టీ భావించడంలో అర్థం ఉంది.అదే పార్టీకి చెందిన రేవంత్ రెడ్డి కూడా టీడీపీ కూటమి వస్తుందనే భావించవచ్చు అని అంటున్నారు. ఆయన తిరుపతి టూర్ పెట్టుకున్న నేపథ్యం చూసినా అదే అనిపిస్తోంది అంటున్నారు. ఆయన గతంలో వచ్చి ఉంటే ఏపీ సీఎం ని కలవకుండా వెళ్తే ఒక చర్చ కలిస్తే మరో చర్చా వచ్చేది. కానీ ఇపుడు సేఫ్ గానే ఆయన మంచి టైం లోనే ఏపీకి వచ్చారు అంటే ఆయన మదిలో ఏముందో అర్థం అవుతోంది కదా అని అంటున్నారు. అంతే కాదుఏపీ కొత్త సీఎం తో తప్పకుండా తాను భేటీ అవుతాను అని ఏపీతో మంచి సంబంధాలు కొనసాగిస్తాను అని రేవంత్ రెడ్డి చెబుతున్నారు అంటే టీడీపీ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని ఆయన భావిస్తున్నారు అని అంటున్నారు. అంతే కాదు జగన్ సైతం రేవంత్ రెడ్డి విషయంలో దూరం పెట్టినట్లుగానే ఉంటున్నారు.ఆయన చంద్రబాబు మనిషి అని ఈ రోజుకీ భావిస్తున్నారు. దాని మీద ఒక ఇంటర్వ్యూలో జగన్ వ్యాఖ్యానిస్తే దాన్ని రేవంత్ రెడ్డి కూడా తిప్పికొట్టారు. అలా ఆరు నెలలుగా ఇరుగు పొరుగు సీఎంల మధ్య కనీసంగా కూడా ఫోన్ కాల్స్ లేవు అని అంటున్నారు. దాంతో మరోసారి జగన్ వస్తే కనుక రేవంత్ రెడ్డి తప్పక భేటీ అవుతాను అని ఉందరని చెబుతున్నారు.

# ఎంపీని 'అమ్మ' అని పిలిచే ఒకే ఒక్క నియోజకవర్గం సుల్తాన్‌పూర్

యూపీ:దేశంలో తమ ఎంపీని అమ్మ అని పిలిచే ఒకే ఒక్క నియోజకవర్గం సుల్తాన్‌పూర్ అని బీజేపీ సీనియర్ నాయకుడు వరుణ్‌గాంధీ అన్నారు. తన తల్లి మేనకాగాంధీ తరపున ఆయన సుల్తాన్‌పూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు.దేశంలోని ఏ లోక్‌సభ నియోజకవర్గంలోనైనా తమ ప్రజాప్రతినిధిని 'మా ఎంపీ' అని చెబుతారని, కానీ ఒక్క సుల్తాన్ పూర్ నియోజకవర్గంలో మాత్రం తమ ఎంపీని 'అమ్మా' అంటారని వరుణ్‌గాంధీ చెప్పారు. నేనిప్పుడు ఇక్కడికి వచ్చింది నా తల్లి నియోజకవర్గ ఎన్నికల ప్రచారం చేయడానికి కాదని, సునీతాన్ పూర్ ప్రజల తల్లి తరపున ప్రచారం చేశానని అన్నారు.కాగా 2024 ఎన్నికల్లో వరుణ్‌గాంధీకి బీజేపీ టికెట్ నిరాకరించింది. పార్టీకి వ్యతిరేక వ్యాఖ్యలు చేసినందుకు ఈసారి ఆయనను పోటీకి దూరం పెట్టింది. మేనకాగాంధీని మీడియా ప్రశ్నించగా.. పార్టీని నడిపేది కేవలం ఎంపీలు కాదని. ఒక పార్టీకి ఎంపీలు కేవలం మూడు, నాలుగు వందల మంది మాత్రమే ఉంటారని, అసలు పార్టీని నడిపేది కార్యకర్తలని అన్నారు.కాగా, సుల్తాన్ పూర్ లోక్‌సభ స్థానానికి లోక్‌సభ ఆరో దశ ఎన్నికల్లో భాగంగా మే 25న పోలింగ్ జరగనుంది. జూన్ 1న జరిగే ఏడో దశ పోలింగ్‌తో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగియనుంది. జూన్ 4న ఫలితాలు వెల్లడికానున్నాయి.



## సంపాదకీయం

**శుక్రవారం 24-05-2024**

# సమిష్టి కృషితో ముందుకు సాగాలి !

కొత్తగా కొన్ని రాష్ట్రాల్లోనూ..కేంద్రంలోనూ కొత్త ప్రభుత్వాలు ఏర్పడబోతున్న తరుణంలో దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై దృష్టి సారించాలి. కొత్తగా ఏర్పడే కేంద్ర ప్రభుత్వం మూసపద్దతిలో కాకుండా దేశం పురోగమించే దిశగా ప్రణాళికలతో ముందుకు సాగాలి. నిరుద్యోగం, ధరల పెరుగుదల, అధికా జనాభా, జివస్టీ వంటి సమస్యలను ప్రధానంగా తలకెత్తుకోవాలి. ఇందుకు కార్యాచరణ సిద్దం చేయాలి. కొత్త ప్రధాని రాష్ట్రాల సిఎంలను విశ్వాసంలోకి తీసుకుని ముందుకు సాగాలి. కలిసి పని చేయాలన్న సంకల్పాన్ని ప్రకటించాలి. తమ పార్టీ అధికారంలో లేదన్న కారణాలతో రాష్ట్రాలను చిన్నతనం చేయరాదు. ఇలా చేయడం అన్నది ప్రజలను అవమానించడమే అవుతుంది. అలాగే దేశంలోను, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న జాతీయ,ప్రాంతీయ పార్టీలు ఆర్థిక క్రమశిక్షణతో పాటు,రాజకీయ క్రమశిక్షణ పాటించాల్సిన అవసరం ఉంది. దేశాన్ని రాష్ట్రాలను ఆర్థికంగా బలోపేతం చేయడం మరచి ప్రజలకు ఉన్న డబ్బులకు తోడు లక్షల కోట్లలో అప్పులు చేసి పందేరం చేయడం, ఖాతాల్లో నగదు బదిలీ చేయడం ఆగిపోవాలి. రాజకీయాలు వేరు..అభివృద్ది వేరు.. ఈ రెంటిని అనుసంధానిస్తూ ముందుకు సాగాలి. రాజకీయాల్లో ఏ పార్టీ అయినా హుందాగా ఉండాలి. రాజకీయాల్లో వ్యక్తిగత విద్వేషాలకు తావు ఉంరాదు. గుదిబండగా మారిన పథకాలను ఎప్పటికైనా సమీక్షించి అందుకు తగు నిర్ణయం తీసుకోవాలి. నితరంతరాయంగా డబ్బుల పందేరం లేదా పథకాలో డబ్బులు పంచడంతో ఓట్లు పొందాలన్న ఎత్తుగడలను ఇక ఎంతమాత్రం కొనసాగించరాదు. ఈ డబ్బుల పందేరాన్ని అభివృద్దిగా చూపి ప్రచారం చేసుకోవడం కూడా సరికాదు. ఆలగే కులగణన అన్నది కులాల కుంపట్లు రగిలించడం ఖాయం. కులాల ఆధారంగా కాకుండా ఆర్థిక పరిస్థితుల ఆధారంగా గణన జరగాలి. కులరహిత సమాజాం కోసం పాటుపడాల్సిన పాలకులు, రాజకీయ నేతలు కులాల కుంపట్లను ఇంకా ప్రోత్సహిస్తున్నారు. రాజకీయాలు మొత్తం కులాల చుట్టే తిరుగుతున్నాయి. ఇందుకోసం కులాల వారీగా పథకాలు ప్రకటిస్తున్నాయి. అయితే నగదు బదిలీలు, లేదా ఇతర తాయిలాలు ప్రకటించడం దారుణం కాక మరోటి కాదు. రాజకీయ పార్టీలన్నీ ఈ సార్వత్రిక బిసిల ఎజెండా అంటూ వల్లె వేసాయి. ఏ కులం అయినా జాబితాలో మరచిపోయామా అని దివిటీ పెట్టి వెతుకుతున్నాయి. జగన్ కూడా సంక్షేమం, అభివృద్దిని జోడించి డబ్బులను నేరుగా ఖాతాల్లో జమ చేయడమే అన్న విశ్లేషన ఇచ్చారు. అదే పనిగా పందేరం పథకాలకు పెద్దపీట వేస్తూ వచ్చారు. డబ్బులు పంచడమే అభివృద్ధి అన్న నినాదం ఎత్తుకున్నారు. ఇది ఎంతమాత్రం సరికాదు. ఈ విషయంలో ఇకనైనా తీరు మారాలి. ఏపిలోఎవరు అధికారం చేపట్టినా ఈ డబ్బుల పందేరంపై ఆంక్షలు విధించాల్సిందే.మౌళిక సదుపాయాలు కల్పించడం, సౌకర్యాలు కల్పించడం, ప్రజలకు ఉపాధి అవకాశాలు పెంచడం ముఖ్యం కావాలి. అభివృద్ధి నమూనా మారకుంటే రాష్ట్రం అధోగతి పాలుకకాక తప్పదు. ఈ విషయాలను గుర్తించి ప్రాంతీయ పార్టీలు పాలన సాగించాలి. అలాగే ప్రజాస్వామ్యంలో నిరంకుశ విధానాలను ఎవరు అవలంబించినా పతనం తప్పదు. అది గుర్తించకపోతే మనుగడ సాగించడం కూడా అంతే కష్టం. ప్రజల సౌకర్యాలను, అవసరాలను గుర్తించి ముందుకు సాగితే ఎంతకాలమైనా ప్రజలు ఆదరిస్తారు. అప్పుల భారం పెరుగుతున్న క్రమంలో ఉచితపథకాలను తగ్గించుకోవడం ద్వారా ప్రజలపై భారం పడకుండా చూడాలి. తాగు,సాగునీటితో పాటు, విద్యుత్, రోడ్డు వసతులను సంపూర్ణంగా అభివృద్ధి చేయాలి. విద్యా వైద్య రంగాలకు కేటాయింపులు పెంచి వసతులను మెరుగు పరచాలి. నిరుద్యోగ సమస్య మొత్తంగా పరిష్కరించకున్నా ఉపాధి అవకాశాలను పెంచాలి. అలాగే కేంద్ర రాష్ట్ర సంబంధాలు వేరు..రాజకీయ పోరాటాలు వేరని గుర్తించాలి. రాష్ట్రాలకు సంబంధించి అనేక సమస్యలను ఎప్పుడూ నిలదీయడంలోనూ వెనకడుగు వేయరాదు. పార్టీలు వేరయినంత మాత్రాన దేశం వేరు కాదన్న విషయం ఆయా రాష్ట్రాల సిఎంలు కూడా గమనించాలి. అలాగే కేంద్ర రాష్ట్రాల మధ్య ఉన్న అధికారిక సంబంధాలు వేరు. కేంద్రం కూడా పెద్దతరహాలో రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకోవాలి. అప్పుడే కేంద్ర రాష్ట్రాల మధ్య బంధం బలోపేతం అవుతుంది. ఇదే సందర్భంలో తాజాగా మారిన రాజకీయాల క్రమంలో ఆయా రాష్ట్రాల ఆర్థిక స్తితిపైనా నీతి ఆయోగ్ ద్వారా హెచ్చరికలు చేయడం మంచిదే. ఫెడరల్ వ్యవస్థలో సిఎంలు ప్రధానిని ,కేంద్ర మంత్రులను, కేంద్ర అధికారులను కలవడం సర్వసాధారణం. ఇదే సందర్భంలో కేంద్ర రాష్ట్రాల మధ్య పన్నుల విధానంలో పారదర్శకత ఉండాలి. జివస్టీ విషయంలో ప్రధానంగా చర్చించాలి. ఏయే రంగగాలు కదులేవుతున్నదీ చర్చించాలి. రాష్ట్రాల అభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందగలదన్న విశ్వాసంతో కేంద్రం ముందుకు సాగాలి. అవినీతి విషయంలో కూడా ఎవరు చేసినా చట్టబద్దంగా శిక్షకు గురి కావాల్సిందే. ఇందులో బెదిరింపు రాజకీయాలకు తావుండరాదు. ఇకపోతే పలు పెండింగ్ ప్రాజెక్టులు, జివస్టీ నిధుల విడుదలకు సంబంధించి కేంద్రంతో సమస్యలు ఉండనే ఉన్నాయి. ఇవన్నీ కూడా పరిష్కరించుకోవడం సిఎంల కర్తవ్యం. ఇవన్నీ కూడా పాలనలో భాగం కావాలి. ఓ వైపు రాష్ట్రాల అభవృద్ధికి కేంద్రం సహకరిస్తూనే..దేశం పురోగమించేలా చేయూతను ఇవ్వాలి. సమిష్టి కృషికి ఈ కొత్త ప్రభుత్వం ఆదర్శం కావాల్సి ఉంది.

# భారత్‌లో విచ్చలవిడిగా విదేశీ సంస్కృతి

హైదరాబాద్,రేవ్ పార్టీ.. ఈ పేరు ఇప్పుడు ఏపీ, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లో మారుమోగిపోతోంది. బెంగళూరు శివారులోని ఓ ఫామ్ హౌస్‌లో జరిగిన రేవ్ పార్టీపై పోలీసుల దాడి వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. తెలుగు సినీతారలు, రాజకీయ ప్రముఖులు ఈ పార్టీలో పాల్గొన్నట్టు ప్రచారం జరుగుతుండమే దీనికి కారణం. అయితే.. రేవ్ పార్టీ అని వినడమే తప్ప చాలామందికి ఇందులో ఏం జరుగుతుందో తెలియదు. దీంతో అసలు రేవ్ పార్టీ అంటే ఏమిటి? ఎలా జరుపుకుంటారు? ఇది చట్ట విరుద్దమా.. ఇందులో పాల్గొనడం నేరమా? ఈ కల్చర్ ఎక్కడినుండి వచ్చింది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అసలు రేవ్ పార్టీ అంటే ఎంటో చదివి తెలుసుకుందాం.



**రేవ్ పార్టీ అంటే ఏమిటి?**

ఒక్కప్పటి ఇండియా వేరు ఇప్పుడున్న ఇండియా వేరు. సంస్కృతి, సాంప్రదాయాలకు నిలయమైన దేశంలో వెస్ట్రన్ కల్చర్ పెరిగిపోయింది. దేశం అభివృద్ధి చెందుతోంది ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయి కాబట్టి కల్చర్‌లో తేడా వచ్చేసింది. ఇలా కాలంతో పాటు యువత బిహేవియర్ కూడా మారుతూ వస్తోంది. ఈ క్రమంలోనే పార్టీ కల్చర్‌కు అలవాటుపడ్డ యువత మరింత ఎంజాయ్ చేసేందుకు నిర్వహిస్తున్నవే ఈ రేవ్ పార్టీలు.

**వెస్ట్రన్ కల్చర్‌కు అలవాటుపడి..**

నేటి హైటెక్ యుగంలో ప్రపంచమే ఓ కుగ్రామంగా మారిపోయింది. దీంతో ఉన్నత చదువుల కోసమో, ఉపాధి కోసమో భారత్ నుంచి విదేశాలకు వెళ్లేవారి సంఖ్య పెద్ద ఎత్తున పెరిగింది. అలాగే.. కేవలం ఎంజాయ్ చేసేందుకు విదేశాలకు, విహారయాత్రలకు వెళ్లేవారు కూడా ఉన్నారు. దీంతో పాశ్చాత్య సంస్కృతి దేశంలోకి ఎంటర్ అయ్యింది. విదేశాల్లో మరీముఖ్యంగా బ్రిటన్, అమెరికా వంటి అడ్వాన్స్‌డ్ కల్చర్ కలిగిన దేశాల్లోనే భారతీయులు ఎక్కువ. కాబట్టి అక్కడి కల్చర్‌ను వంటపట్టించుకుని స్వదేశానికి వస్తున్నవారు.. ఇక్కడివారికి ఆ పార్టీ కల్చర్‌ను కొంతపుంతలు తొక్కిస్తున్నారు. ఇలాంటి వాటిలో రేవ్ పార్టీ ఒకటి.

**అంతా సీక్రెట్.. బడా బాబుల పిల్లలకే ఎంట్రీ**

రేవ్ పార్టీ ఏర్పాటు అంత ఆషామాషీ వ్యవహారం కాదు. సాధారణంగా సినీ, రాజకీయ ప్రముఖులు ఏదైనా కార్యక్రమంలో పాల్గొంటున్నారంటే మామూలు హంగామా వుండదు. కానీ రేవ్ పార్టీ అలాకాదు%ొ% సినీ తారలు, ఇతర ప్రముఖులు పాల్గొన్నా అంతా గోప్యంగా వుంటుంది. ఎందుకంటే ఈ పార్టీ జరిగే పద్దతి అలాంటిది కాబట్టి. రేవ్ పార్టీలో బడాబాబుల పిల్లలకే ఎంట్రీ. వారిని ఆకర్షించేందుకు సినీ తారలను రంగంలోకి దింపుతారు నిర్వహకులు. అంతేకాదు.. మద్యంతో పాటు డ్రగ్స్ కూడా ఏర్పాటుచేస్తారు. కొన్ని రేవ్ పార్టీల్లో అయితే అమ్మాయిలను కూడా ఏర్పాటు చేస్తారు. ఇలా విచ్చలవిడితనానికి నిలువెత్తు రూపమే ఈ రేవ్ పార్టీలు. చెవులు పగిలే మ్యూజిక్ కు మద్యం, డ్రగ్స్ మత్తులో చిందులేయడం%ొ% అశ్లీల కార్యకలాపాలకు పాల్పడుతూ ఎంజాయ్ చేయడమే ఈ పార్టీ కల్చర్. అందువల్లే యువత చాలా ఈజీగా ఈ రేవ్ పార్టీలకు అలవాటుపడుతున్నారు. నిర్వహకులు దీన్ని క్యాష్ చేసుకుంటున్నారు.

**రేవ్ పార్టీ ఎక్కడ పుట్టింది**

రేవ్ పార్టీ కల్చర్ అనేది 1950 సమయంలో ఇంగ్లాండ్‌లో మొదలయ్యింది. మెల్లమెల్లగా ఇది ప్రపంచానికి పాకింది. ఇండియాలోకి ఈ కల్చర్ కాస్త ఆలస్యంగా వచ్చినా ఇప్పుడది ప్రతిచోటికి పాకింది. గోవా వంటి టూరిస్టు ప్రాంతాల్లో తొలినాళ్లలో రేవ్ పార్టీలు జరుగుతుండేవి.. కానీ, ఇప్పుడవి ప్రతి నగరానికి చేరాయి. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి ఐటీ నగరాల్లో ఈ రేవ్ పార్టీలు ఎక్కువగా జరగడం విశేషం.

**ఎంట్రీ ఫీజు.. 50 లక్షలు**

రేవ్ పార్టీ నిర్వహణ చాలా ఖరీదైన వ్యవహారం. కాబట్టి అందులో పాల్గొనాలన్నా పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఇక.. చట్టవిరుద్దంగా డ్రగ్స్, అమ్మాయిలు ఉంటారు%ొ% సినిమా వాళ్లు కూడా పాల్గొంటారు కాబట్టి సీక్రెట్ అనేది చాలా ఇంపార్టెంట్. అందువల్లే బాగా తెలిసినవారు, డబ్బున్నవారికే ఎంట్రీ ఉంటుంది. ఇక.. బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో ఒక్కక్కరికి ఎంట్రీ ఫీజుగా 50 లక్షలుగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

**మత్తులో ఎంజాయ్ చేయడమే లక్ష్యం**

సిటీస్‌కి దూరంగా ఉండే ఫామ్ హౌస్‌లు, రిసార్టలలో ఈ రేవ్ పార్టీలు జరుగుతుంటాయి. పెద్ద పెద్ద శబ్దాలతో మ్యూజిక్ పెట్టినా ఎవరికీ తెలియకుండా ఉండేలా జాగ్రత్త పడతారు. ఇక.. మద్యం, డ్రగ్స్ విచ్చలవిడిగా వినియోగిస్తుంటారు. పార్టీలో పాల్గొనే యువతీ యువతులు ఏం చేసినా అడిగేవారు ఉండరు. కొన్ని రేవ్ పార్టీల్లో అయితే శృంగార కార్యకలాపాల కోసం ప్రత్యేక గదులను కూడా కేటాయిస్తారు. ఇలా మత్తులో ఎంజాయ్ చేయడమే రేవ్ పార్టీ లక్ష్యం..

**రెండు, మూడు రోజుల దాకా కొనసాగేలా**

ఇలా మొదలైన పార్టీ.. ఓ రోజంతా లేకపోతే రెండుమూడు రోజులు ఎంజాయ్ చేసేలా నిర్వహిస్తుంటారు. ఒక్కసారి రేవ్ పార్టీలోకి ఎంట్రీ ఇస్తే చాలు.. బయటి ప్రపంచంతో సంబంధం ఉండదు. సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు ముందుగానే తీసుకుంటారు. చుట్టుపక్కల సీసీ కెమెరాలు కూడా పనిచేయవు. ఇలా ఎంత విచ్చలవిడిగా వ్యవహరించినా భయం లేదనే భరోసాను నిర్వహకులు ఇస్తారు. కాబట్టి రేవ్ పార్టీల్లో యువత రెచ్చిపోతుంటారు. రోజురోజుకు యువతలో ఇలాంటి పార్టీలపై ఆసక్తి పెరుగుతోంది కాబట్టి బెంగళూరులో మాదిరిగా రేవ్ పార్టీలు బయటపడుతున్నాయి.

**రేవ్ పార్టీలు చట్టవిరుద్ధమా?**

సాధారణంగా పార్టీలు జరుపుకోవడం వేరు%ొ% రేవ్ పార్టీలు వేరు. మద్యంతో కూడిన పార్టీలు, రిసార్టులు, ఫామ్‌హౌస్‌లలో జరిగే పార్టీలకు పోలీసులు అనుమతి తప్పనిసరి. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు లేకుండా పార్టీ జరిగితే ఓకే. కానీ, డ్రగ్స్, అమ్మాయిలు ఎంటర్ అయితేనే ఆ పార్టీ కాస్త చట్టవిరుద్దంగా మారుతుంది. రేవ్ పార్టీల్లో డ్రగ్స్, అమ్మాయిలు కామన్ కాబట్టి చట్టవిరుద్ధమే. ఇలాంటి పార్టీలపై పోలీసులు దాడిచేసి నిర్వహకులను అరెస్ట్ చేస్తుంటారు. అలాగే.. పార్టీలో పాల్గొన్నవారు డ్రగ్స్ తీసుకున్నారో లేదో నిర్ణయించేందుకు టెస్టులు చేయిస్తుంటారు. ఒకవేళ డ్రగ్స్ తీసుకున్నట్లు తేలితే చట్టపరంగా చర్యలు తీసుకుంటారు. అశ్లీల కార్యకలాపాలకు కూడా రేవ్ పార్టీలు అడ్డాగా మారాయి. స్వయంగా నిర్వహకులే అమ్మాయిలను సరఫరా చేస్తున్న ఘటనలు అనేకం వెలుగుచూసాయి. కాబట్టి ఇలాంటి రేవ్ పార్టీలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు.

**హేమ పాల్గొన్నట్టు తేలితే సస్పెండ్ చేస్తాం..మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేసన్ జాయింట్ సెక్రెటరీ కరాటే కళ్యాణి**

రేవ్ పార్టీలు పెట్టే వారిని, వాటిలో పాల్గొనే వారిని రేవు పెట్టి ఉతికేయాలని సినీ నటి కరాటే కళ్యాణి సంచలన వ్యాఖ్యలు చేశారు. బెంగళూరు రేవ్ పార్టీలో నటి హేమ పాల్గొందనే విషయంపై కళ్యాణి స్పందించారు. హేమ ఆ పార్టీలో పాల్గొందని తేలితే మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ నుంచి సస్పెండ్ చేస్తామని స్పష్టం చేశారు. తప్పు చేసిన వారు ఆడవాళ్లయినా, మగవాళ్లయినా ఒకటేనని, వదిలిపెట్టేదిలేదని తేల్చిచెప్పారు. తప్పు ఎవరు చేసినా తప్పేనని, దానికి ఫలితం అనుభవించాల్సిందేనని మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీగా కరాటే కళ్యాణి చెప్పుకొచ్చారు.

**పార్టీల పేరుతో విచ్చలవిడిగా డ్రగ్స్..**

పార్టీల పేరుతో డ్రగ్స్ తీసుకుంటూ విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్న వారిపై కళ్యాణి మండిపడ్డారు. ఈ పార్టీల వల్ల ఒక్కరు తప్పుచేసినా మొత్తం ఇండస్ట్రీకి చెడ్డపేరు వస్తోందని, మన సంస్కృతి నాశనం అవుతోందని కళ్యాణి వాపోయారు. రూ.50 లక్షలు పెట్టి రేవ్ పార్టీలు చేసుకోవడం అవసరమా అని ప్రశ్నించారు. ఎంజాయ్ చేయాలనుకుంటే కుటుంబంతో కలిసి విహారయాత్రకు వెళ్లి రావాలని సూచించారు. హేమను ఎవరూ ఇరికించలేదని, నోటి దురుసుతనమే ఆమెకు శత్రువని కళ్యాణి చెప్పారు. 'హేమక్కా ఇలా అయిపోయావేంటి.. నిన్ను చూస్తే జాలేస్తోంది. ఈ కేసు నుంచి నువ్వు తొందరగా బయటపడాలని కోరుకుంటున్నా' అంటూ కళ్యాణి వ్యాఖ్యానించారు.

# అమెరికా వెళ్లే విద్యార్థులకు గుడ్ న్యూస్




అమెరికాలో ఉన్నద చదువుకోసం వెళ్లే విద్యార్థులకు శుభవార్త వినిపించించి ఆ దేశ కౌన్సిల్ జనరల్ వీసా బుకింగ్ స్లాట్ నిమిషాల వ్యవధిలో భర్తీ కానుండటంతో కౌన్సిల్ పిరియడ్ ను మరో రెండు వారాలు పెంచినట్లు ప్రకటించింది.. వివరాలలోకి వెళితే అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసం కోసం వెళ్లే విద్యార్థుల సంఖ్య ఏటేటా పెరుగుతూనే ఉంది. విద్యార్థులకు ఆ దేశం జారీ చేసే స్టూడెంట్ వీసా (ఎఫ్-1) లకు డిమాండ్ చాలా ఎక్కువ. దీంతో వాటి కోసం విడుదల చేసే ఇంటర్వ్యూ స్లాట్ లకూ విపరీతమైన డిమాండ్ నెలకొంది. సోమవారం ఎఫ్-1 వీసా స్లాట్లు ఆన్ లైన్ లో విడుదల చేయగా.. కేవలం ఐదు నిమిషాల్లోనే ఏకంగా పదివేల స్లాట్లు బుక్ అయ్యాయి.దీంతో అమెరికా వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్న విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే యూనివర్సిటీల అడ్మిషన్ సంపాదించిన పలువురు విద్యార్థులు.. ఎఫ్-1 వీసా ఇంటర్వ్యూ కోసం స్లాట్ బుక్ చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. కొంతమంది విద్యార్థులు ఏకంగా ఆరు నెలల నుంచి వీసా ఇంటర్వ్యూ కోసం ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. వీసా స్లాట్లు విడుదల చేసిన ప్రతిసారీ నిమిషాల వ్యవధిలోనే బుక్ అవుతున్నాయని చెబుతున్నారు.వచ్చే విద్యా సంవత్సరంలో అమెరికాలోని వివిధ యూనివర్సిటీలలో చేరేందుకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసుకున్నప్పటికీ వీసా ఇంటర్వ్యూ విషయంలోనే ఇబ్బంది పడుతున్నామని వివరించారు. ఇంటర్వ్యూ కోసం స్లాట్ బుకింగ్ చేసుకోవడం గగనమైపోయిందని, స్లాట్లు దొరకడంలేదని వాపోయారు. తాజాగా సోమవారం కూడా ఐదు నిమిషాల్లో పది వేల వీసా స్లాట్లు బుక్ కావడంతో విద్యార్థుల్లో టెన్షన్ నెలకొంది. దీంతో పలువురు విద్యార్థులు తమ పరిస్థితిని వివరిస్తూ వీసా స్లాట్లు పెంచాలంటూ అమెరికన్ ఎంబసీకి ఆన్ లైన్ లో రిక్వెస్ట్ పెడుతున్నారు. ఈ విజ్ఞప్తులపై హైదరాబాద్ లోని అమెరికన్ కాన్సులేట్ జనరల్ ట్విట్టర్ లో స్పందించారు. స్టూడెంట్ వీసా సెషన్ ను రెండు వారాల పాటు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. ఈ ఏడు లక్షా 50 వేల మంది విద్యార్థులకు స్టూడెంట్ వీసాలు ఇవ్వనున్నట్లు ఇప్పటికే అమెరికా ఇమ్మిగ్రేషన్ శాఖ ప్రకటించింది.. అందుకనుగుణంగా ఇండియాలోని చెన్నై, ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ లో ఉన్న అమెరికన్ కాన్సులేట్ లో వీసా ఇంటర్వ్యూలను మరో రెండు వారాల వరకు కొనసాగించనున్నట్లు ఒక ప్రకటన వెలువడింది.

## ఆరోగ్యశ్రీ కింద రూ.203 కోట్లు విడుదల

అమరావతి, నెట్‌వర్క్ ఆసుపత్రులకు నిధులు విడుదల చేసినట్టు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ వెల్లడించింది. ప్రస్తుతం రూ.203 కోట్లు విడుదల చేశామని, పెండింగ్ బకాయిలు త్వరలో విడుదల చేస్తామని తెలిపింది. ఆరోగ్యశ్రీ సేవలకు చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించామని ట్రస్ట్ వెల్లడించింది. పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ఆరోగ్యశ్రీ ట్రస్ట్ అధికారులు, ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ ప్రతినిధుల మధ్య మంగళవారం జరిగిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో బుధవారం నుంచి తమ అసోసియేషన్‌లో సభ్యత్వం కలిగిన ఆసుపత్రుల్లో రోగులకు చికిత్స అందించడాన్ని నిలిపివేయనున్నట్లు ఆశా స్పష్టం చేసింది. గత ఆగస్టు నుంచి బకాయిపడిన రూ.1,500 కోట్ల బిల్లులను వెంటనే చెల్లించకుంటే ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తామని ఆశా ప్రకటించిన నేపథ్యంలో అసోసియేషన్ ప్రతినిధులతో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈఓ లక్ష్మీశా మంగళవారం రాత్రి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా చర్చించారు. ప్రభుత్వం బిల్లుల చెల్లింపుల కోసం చర్యలు తీసుకుంటుందని సీఈఓ చెప్పారు. గతంలోనూ ఇలాగే చెప్పినప్పటికీ బిల్లుల చెల్లింపులు జరగలేదని ప్రతినిధులు పేర్కొన్నారు. బిల్లుల చెల్లింపులకు నిర్దిష్టమైన చర్యలు కనిపించనందున బుధవారం నుంచి ఆరోగ్యశ్రీ, ఉద్యోగుల ఆరోగ్య బీమా కింద కొత్త కేసులను తీసుకునేది లేదని ఆశా యాక్టింగ్ ప్రెసిడెంట్ వై.రమేష్, ప్రధాన కార్యదర్శి సి.అవినాష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో దిగొచ్చిన ప్రభుత్వం తాత్కాలికంగా రూ.203 కోట్లు విడుదల చేసింది.

# పాలకులలకు ఆర్థిక క్రమశిక్షణ ముఖ్యం!

హైదరాబాద్,రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలు ఆర్థిక క్రమశిక్షణతో పాటు,రాజకీయ క్రమశిక్షణ కూడా పాటించకుంటే మట్టి కరచిపోతాయని గతంలో అనేక సందర్భాల్లో చూశాం. గుదిబండగా మారిన పథకాలకు మంగళం పాడాలి. నితరంతరాయంగా డబ్బుల పందేరంతో ఓట్లు పొందాలన్న పథకాలను ఇక ఎంతమాత్రం కొనసాగించరాదు. ఈ డబ్బుల పందేరాన్ని అభివృద్ధిగా చూపి ప్రచారం చేసుకోవడం కూడా సరికాదు. అప్పుల భారం పెరుగుతున్న క్రమంలో ఉచితపథకాలను తగ్గించుకోవడం ద్వారా ప్రజలపై భారం పడకుండా చూడాలి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రూపాయికే కిలో బియ్యం పథకం గుదిబండగా మారింది. ఇప్పుడు ధరలను పెంచాల్సిన అవసరం ఉంది. అలాగే జనాభాను మించి తెల్లకార్డులు ఉన్నాయి. వీటిని సమీక్షించాలి. బియ్యం ధరలు కనీసం పదిగా నిర్ణయించాలి. ఇది ఎపికి కూడా వర్తిస్తుంది. కుటుంబ సర్వే ప్రకారం అర్హుల జాబితాను గుర్తించాలి. అలాగే రైతుబంధు జాబితాను కూడా మళ్లీ సమీక్షించాలి. బడాభూములున్న వారికి, తోటలు, బంజరు భూములున్న వారికి రైతుబంధు సాయం అందకుండా చూడాలి. పథకాలతో ప్రజలను మచ్చిక చేసుకోవచ్చేమో కానీ అదే అభివృద్ధి అని నమ్మించడం సరికాదు. తాగు,సాగునీటితో పాటు, విద్యుత్, రోడ్డు వసతులను సంపూర్ణంగా అభివృద్ధి చేయాలి. విద్యావైద్య రంగాలకు కేటాయింపులు పెంచి వసతులను మెరుగు పరచాలి. నిరుద్యోగ సమస్య మొత్తంగా పరిష్కరించకున్నా ఉపాధి అవకాశాలను పెంచాలి. రాజకీయాలు వేరు..అభివృద్ధి వేరు.. ఈ రెంటిని అనుసంధానిస్తూ ముందుకు సాగాలి. రాజకీయాల్లో ఏ పార్టీ అయినా హుందాగా ఉండాలి. రాజకీయాల్లో వ్యక్తిగత విద్వేషాలకు తావు ఉంరాదు. ఎపిలో జగన్ ప్రభుత్వం విపక్షాలను అణచివేయడం, కేసులు పెట్టడంలో ప్రత్యేక శ్రద్ద తీసుకుంటోంది. కాంగ్రెస్, టిడిపిలు తెలంగాణలో ఉనికి లేకుండా పోవాలని కెసిఆర్ వేసిన ఎత్తుగడలు ఎదురుతిరిగాయి. బెంగాల్లో కమ్యూనిస్టులు ఇదే ధోరణిలో 30 ఏళ్లపాటు రాజ్యమేలారు. తమకు తిరుగు లేదన్న ధోరణిలో వారు ప్రజల ఆశలను, ఆకాంక్షలను పట్టించు కోలేదు. తమ నిరంకుశ పాలనకు ప్రజాస్వామ్యం, అభివృద్ధి ముసుగేసారు. కానీ అక్కడా మమతా బెనర్జీ కమ్యూనిస్టులను కూకటి వేళ్లతో పెకిలించారు. అయితే ఆమె కూడా అదే ధోరణిలో నిరంకుశ పాలన సాగించడంతో ఇప్పుడు మమతా బెనర్జీ పునాదులు కూడా కదులుతున్నాయి. బిజెపి అక్కడ చేస్తున్న పోరాటానికి ప్రజలు మద్దతు పలుకుతున్నారు. నిరాశా నిస్పృహలతో ఉన్న మమతా బెనర్జీ బిజెపి నేతలపై దాడులకు దిగుతోంది. గత ఎన్నికల్లో గెలిచినా బిజెపి కూడా బలంగానే ఉందని ఉనికిని చాటింది. తెలంగాణల కూడా తొలుత తెలుగుదేశం పార్టీని, ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీని కోలుకోకుండా దెబ్బతీసిన కేసీఆర్, ఇప్పుడు తన ఉనికినే కోల్పోయే ప్రమాదంలో పడ్డారు. కెసిఆర్ అహంకారం వల్ల కాంగ్రెస్, బిజెపిల బలం అనూహ్యంగా పెరగడానికి ప్రధాన కారణం. అధికారం కోల్పోయాక కూడా కేసీఆర్ చిన్నపాటి విమర్శను కూడా స్వీకరించలేని స్థితికి చేరుకున్నారు. జగన్ కూడా అదే ధోరణితో ఉన్నారు. అదే పనిగా పందేరం పథకాలకు పెద్దపీట వేసారు. డబ్బులుపంచడమే అభివృద్ధి అన్న నినాదం ఎత్తుకున్నారు. ఇది ఎంతమాత్రం సరికాదు. మౌళిక సదుపాయాలు కల్పించడం, సౌకర్యాలు కల్పించడం, ప్రజలకు ఉపాధి అవకాశాలు పెంచడం ముఖ్యం కావాలి. అభివృద్ధి నమూనా మారకుంటే రాష్ట్రం అధోగతి పాలుకకాక తప్పదు. ఈ విషయాలను గుర్తించి ప్రాంతీయ పార్టీలు పాలన సాగించాలి. అలాగే ప్రజాస్వామ్యంలో నిరంకుశ విధానాలను ఎవరు అవలంబించినా పతనం తప్పదు. అది గుర్తించకపోతే మనుగడ సాగించడం కూడా అంతే కష్టం. అందుకే రేపటి ఎన్నికల ఫలితాలతో గుణపాఠం నేర్చుకోవాలి.

# వ్యాధుల నివారణకు ఇదే సమయం

విజయవాడ, వచ్చేది వర్షాకాలం. వర్షాకాలంఓనే సీజనల్ వ్యాధులు ఇబ్బంది పెడుతాయి. ఏటా ఇలాంటి సమ్యలు చూస్తూనే ఉన్నాం. ఈ క్రమంలో ఇప్పటి నుంచే సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలి. వర్షాకాల వ్యాధులపై చైతన్యం చేయాల్సి ఉంది. రాష్ట్రంలో గతంలో ప్రజలు డెంగీ, తదితర వైరల్ జ్వరాలతో ఇబ్బందులు పడేవారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత కొనసాగితే విషజ్వరాలు లేదా, అంటువ్యాధులు ప్రబలవని వైద్యనిపుణులు అంటున్నారు. ప్రతి ఏటా వానాకాలంలో అంటు వ్యాధులు ప్రబలడం సర్వసాధారణంగా మారింది. చలికాంల వచ్చే సరికి స్వైన్ ఫ్లూ లాంటి వ్యాధులు విజృంభిస్తుంటాయి. పట్టణాలు,పల్లెలు అనే తేడా లేకుండా స్వచ్ఛంగా ఉంచాలని పదేపదే ప్రచారం చేస్తున్నా ప్రజలు పట్టించుకోవడం లేదు. ఎవరికి వారు తమకేంటన్న భావనతో అపరిశుభ్రతకు కారణమవు తున్నారు. ముఖ్యంగా దోమల వృద్ధికి అవకాశం ఉన్న ఉన్న నీటి తొట్లు, నీటి నిలువ ప్రదేశాల్లో నీటిని తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు. దీంతోపాటు ఇంటి మూలల్లో ఉన్న ఉపయోగంలో లేని వస్తువులను తీసివేసి, దోమల లార్వా వృద్ధికి అవకాశం లేకుండా చేసే చర్యలను చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పారిశుద్ధ్య నిర్వహణ పైన పైన దృష్టి సారించి సీజనల్ వ్యాధుల బారి నుంచి కాపాడుకునే ప్రయత్నం ప్రారంభించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఇళ్ళ ముందు కానీ లేదా ఇంటి లోపల నీటి నిలువ ఉండే ప్రాంతాల్లో నీటిని తొలగించే ప్రయత్నం చేయడం లేదా వాటిపైన నూనెను చల్లడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. దీంతోపాటు ఇళ్లలో ఉన్న పనికిరాని లేదా ఉపయోగం లేని లేని వస్తువులను తొలగించుకోవాలని కోరారు. అప్పుడేసీజనల్ వ్యాధులను రాకుండా నిరోధించ గలమని అన్నారు. కాలువల్లో వాడిపడేసిన వ్యర్తాలను, ప్లాస్టిక్‌ను పడేయడం వల్ల కూడా మురికినీరు నిలిచి పోతోంది. దీనికి ప్రజలే బాధ్యత వహించాలి. మురుగునీటి పారుదల సక్రమంగా లేకపోవడం వల్ల ఏలూరులో వింతవ్యాధి ప్రజలను తీవ్రంగా భయపెట్టింది. ఇకపోతే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నామని నాయకులు చెపుతున్నా వాస్తవం వేరే రకంగా కనిపిస్తోంది. పారిశుద్ధ్య లేమి కారణంగానే ఇటువంటి వ్యాధులు ప్రబలుతున్న విషయం సుస్పష్టం. ఈ క్రమంలో ప్రజలు పురపాలకసంస్థపై ధ్వజమెత్తుతున్నారు. అపరిశుభ్రత కారణంగా దోమలు విజృంభించడం, వింతవ్యాధులు విజృంభించడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నది. సీజనల్ వ్యాధుల నివారణ ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. బహిరంగ ప్రదేశాలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీలు దోమల నివారణతో పాటుగా పారిశుద్ధ్య నిర్వహణ చేసేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో పారిశుద్ధ్య నిర్వహణ పైన దృష్టి సారించి, ప్రభుత్వ ప్రయత్నాలతో కలిసి రావాలి.ముఖ్యంగా దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు సొంత ఇళ్లలోని పారిశుద్యం అత్యంత కీలకమైన అంశం. ఇళ్ళలో పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాల్సి ఉంది. ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యవంతం చేసి, పారిశుద్ధ్య నిర్వహణలో వారిని భాగస్వాములను చేసేందుకు ప్రభుత్వ అధికారులు, పురపాలక ప్రతినిధులు కృషి చేస్తూనే ఉన్నారు. ఇళ్ళలో పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని పదేపదే కోరుతున్నారు.

# ఓరుగల్లుకు ఎయిర్ జర్నీ.. విమానాల ల్యాండింగ్‌కు సన్నద్ధం



వరంగల్, వరంగల్ విమానాశ్రయ నిర్మాణానికి చిక్కుముడులు వీడుతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్? పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాంతీయ విమానాశ్రయం విషయంలో ఎయిర్? పోర్ట్స్? అథారిటీ వేచి చూసే ధోరణితో ఉంది. వరంగల్ విమానాశ్రయాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించటంతో ఏఏఐ అధికారుల్లో కదలిక వచ్చింది. ఎయిర్‌పోర్ట్స్ నిర్మాణానికి వీలుగా ప్రస్తుతం ఉన్న 706 ఎకరాల భూమికి అదనంగా 253 ఎకరాలు కేటాయిస్తూ ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందుగానే మునుపటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

సర్వేపై రాని స్పష్టత..

హైదరాబాద్‌కు చెందిన జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్‌తో పాటు రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి కూడా అనుమతులు తీసుకోవాల్సి ఉందని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. భూమి కేటాయింపు ఉత్తర్వుల నేపథ్యంలో ఏఏఐ అధికారులు వరంగల్ విమానాశ్రయం పరిస్థితులపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు ఎలాంటి సమాచారం లేకపోవటంతో అయోమయం నెలకొంది. విమానాశ్రయ నిర్మాణం కోసం పరిశీలన చేశారా? మరేదైనా కారణాలతో సర్వే చేశారా? అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

విస్తరణకు 1200 కోట్ల ఖర్చు అంచనా..

విమానాశ్రయాన్ని దశల వారీగా విస్తరించాలని మునుపటి ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత ఏటీఆర్ స్థాయి చిన్న విమానాల రాకపోకలకు వీలుగా నిర్మించాలనుకున్నారు. దీనికి అనుగుణంగా మునుపటి ప్రభుత్వం 253 ఎకరాలను కేటాయించింది. ఏఏఐ అధికారులు కనీసం 400 ఎకరాలు కేటాయించాలని తమ నివేదికలో వెల్లడించారు. విస్తరణకు సుమారు రూ.1,200 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. అంత మొత్తాన్ని ఖర్చు చేసేందుకు అప్పటి ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేయలేదని అధికారులు చెబుతున్నారు. రూ.400 కోట్ల నుంచి రూ.500 కోట్లతో విమానాల రాకపోకలకు ఏర్పాట్లు చేయాలని చెప్పడమే కాకుండా, ఆ మేరకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు స్పష్టం చేసింది. నిజానికి ఒకేసారి నిర్మాణాన్ని చేపట్టడమే అన్ని రకాలుగా ఉపయుక్తంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

సమీక్ష చేయనున్న ఎయిర్‌పోర్ట్ అథారిటీ బృందం

ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం విమానాశ్రయ నిర్మాణానికి సుముఖత వ్యక్తం చేసినా, ఏ స్థాయిలో అన్నది నిర్ణయించాల్సి ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల కోడ్? అమల్లో ఉంది. అది ముగిసిన తర్వాత ఈ విషయంపై సీఎం రేవంత్? రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు. పూర్తి స్థాయిలో అభివృద్ధా? లేక మునుపటి ప్రభుత్వం నిర్ణయం ప్రకారం ముందుకు వెళ్లడమా? అన్నది అప్పుడు ఖరారవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీనిపై సమీక్షించేందుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారుల బృందం త్వరలో రాష్ట్రానికి రానున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆ బృందం వరంగల్?లోని ఎయిర్? స్ట్రిప్?ను పరిశీలించడంతో పాటు ఉన్నతాధికారులతో చర్చలు నిర్వహించాలని నిర్ణయించింది.

# ఏపిని కలవరపెడుతున్న హింసా ఘటనలు



అమరావతి, ఎపిలో తాజా ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇవిఎంల ధ్వంసం నేరం అని తెలిసినా ఓ ఎమ్మెల్యే ఇలా తెగించడం దారుణం. అధికార పార్టీ ఎమ్మెల్యే పిన్నెల్లి తీరు రాజకీయాల్లో మాయని మచ్చగా నిలిచిపోనుంది. ఇకపోతే ఓట్ల లెక్కింపు రోజున రాష్ట్రంలో భారీగా అల్లర్లు జరుగుతాయనే సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పరస్పరం దాడులకు దిగే అవకాశం ఉందంటూ నిఘా విభాగం వరుస హెచ్చరికలతో చర్యలకు సిద్ధమయ్యారు. ఈ నెల 13న పోలింగ్ రోజు, ఆ తర్వాత చోటు చేసుకున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లాల్లో ముమ్మర గాలింపు చర్యలు మొదలయ్యాయి. మరీ ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగాలు పల్నాడు, రాయలసీమ జిల్లాల పోలీసు అధికారులను అప్రమత్తం చేశాయి. పోలింగ్ తర్వాత జరిగిన అల్లర్లను అడ్డుకోలేకపోవడం, విధి నిర్వహణలో నిర్లక్ష్యం, ఎస్పీల నుంచి ఎస్‌ఐల దాకా అధికారులపై ఈసీ చర్యలతో ఇప్పటి నుంచే జాగ్రత్త పడుతున్నారు. కౌంటింగ్ రోజు ఎలాంటి హింసాత్మక ఘటనలకు అవకాశంఇవ్వకుండా పోలీస్ యంత్రాంగం రంగంలోకి దిగింది. ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు జూన్ 4న జరుగనుంది. అయితే తాజా ఘటనల నేపథ్యంలో ఔంటింగ్ ముగిసినా నెలాఖరు వరకూ కేంద్ర సాయుధ బలగాలను రాష్ట్రంలోనే కొనసాగించాలని సీఈసీ ఆదేశించింది. ఇప్పటికే కేంద్ర హోంశాఖ పంపిన 25 కంపెనీల ఫోర్స్....రాష్ట్రంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో ఉంది. కౌంటింగ్ అనంతరం అధికారంలోకి వచ్చే పార్టీ, ఓడిన పార్టీకి చెందిన శ్రేణులు పరస్పరం దాడులు చేసుకునే అవకాశం ఉందన్న నిఘా హెచ్చరికలతో ఈ బలగాలను కొనసాగిస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై ప్రశాంత వాతావరణం ఏర్పడిన తర్వాతే కేంద్ర సాయుధ బలగాలు రాష్ట్రం నుంచి తిరిగి వెళ్లనున్నాయి. ఇకపోతే నిఘా వర్గాల హెచ్చరికతోపాటు పోలీసులకు అందిన సమాచారంతో మంగళవారం వేకువజాము నుంచే జిల్లాల్లో కార్డన్ సెర్చ్ మొదలైంది. సమస్యాత్మక ప్రాంతాలు, అనుమానిత వ్యక్తులు, ముఖ్యమైన కూడళ్లు, గడ్డి వాములు, పశువుల పాకలు, పండ్ల తోటలు.....ఇలా ఒకచోటంటూ లేకుండా జల్లెడ పడుతున్నారు. కత్తులు, ఇనుప రాడ్లు, కర్రలు, బరిసెలు, పేలుడు పదార్థాలు, మద్యం నిల్వలు, రికార్డుల్లేని వాహనాలు, అనుమానితుల కదలికలు ఏదీ వదిలి పెట్టడం లేదు. ఎటువంటి పత్రాలులేని 1104వాహనాలను జప్తు చేశామని, 482లీటర్ల నాటుసారా, సుమారు 480లీటర్ల నాన్ డ్యూటీ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. కృష్ణా జిల్లాలోని అవనిగడ్డ, గుడివాడ నియోజకవర్గాల్లో ఇంటింటికీ తిరిగి పోలీసులు తనిఖీలు సాగించారు. నూతన వ్యక్తుల సంచారంపై ఆరా తీశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సమస్యాత్మక గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు, పరిసరాలు, గడ్డి వాములలో మంగళవారం సోదాలు నిర్వహించారు. మారణాయుధాల కోసం అణువణువూ గాలించారు. అనకాపల్లి జిల్లాలో పోలీసులు మంగళవారం తనిఖీలు జరిపారు. ఎటువంటి పత్రాలు లేని 119 ద్విచక్ర వాహనాలను, ఐదు ఆటోలను, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. జిల్లాల్లో ఎక్కడికక్కడ కా÷-డ్గ÷న్ సెర్చ్ (తనిఖీలు) చేపట్టి గట్టి చర్యలు తీసుకోవా లని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఆదేశించారు. ఈ ఆదేశాలతో ఎస్పీలు... జిల్లాల్లో బృందాలను ఏర్పాటుచేశారు. కౌంటింగ్ పక్రియ ముగిసేవరకూ ఎలాంటి సెలవుల్లేవంటూ సిబ్బందితో పోలీసు అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా జల్లెడ పడుతున్నారు. పోల్ డే హింస జరిగిన ప్రాంతాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించి... ప్రతి ఇల్లూ, ప్రతి మలుపులోనూ పోలీసులు తనిఖీ చేస్తున్నారు. ఎటువంటి మారణాయుధాలు ఉన్నా స్వచ్ఛందంగా ఇవ్వాలని, తాము గుర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయంటూ ఇళ్ల వద్దకెళ్లి అడుగుతున్నారు. కౌంటింగ్ హిస్టరీ షీట్స్ ఉన్న ప్రతి ఒక్కరినీ అదుపులోకి తీసుకుని బైండోవర్ చేస్తున్నారు. సంఘ విద్రోహశక్తుల కదలికలపై నిఘాపెట్టి ఏ మాత్రం అనుమానం వచ్చినా అరెస్టు చేస్తున్నారు. వారిని దూరంగా ఉండే పోలీసు స్టేషన్లకు తరలిస్తున్నారు. పోలింగ్ రోజు హింసకు పాల్పడిన వేలాది మందిని వెతికేందుకు పదుల సంఖ్యలో పోలీసు బృందాలు తిరుగుతున్నాయి. రాష్ట్రం దాటి వెళ్లినవారిని సైతం రప్పించి మరీ అదుపులోకి తీసుకొంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గడిచిన మూడు రోజుల్లో 301 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించినట్లు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు.

# స్త్రీనిధిలో పాతుకు పోయిన రిటైర్డ్ ఉద్యోగులు




వరంగల్, తెలంగాణ స్త్రీ నిధి పరపతి సహకార సమాఖ్య లిమిటెడ్లో రిటైర్డ్ ఉద్యోగుల పెత్తనం, సిఎస్ఆర్ నిధుల మళ్లింపు, ఇతర అభియోగాల నేపథ్యంలో స్త్రీ నిధి పరపతి సహకార సమాఖ్య లిమిటెడ్ పై మంత్రి సీతక్క జనవరి నెలలో సమీక్ష నిర్వహించి స్త్రీనిధిలో అవినీతి ఆరోపణలపై విచారణకు ఆదేశించారు. ప్రస్తుతం ఆ సమాఖ్యకు మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎ.జి.యం స్థాయి విశ్రాంత నాబార్డ్ అధికారి అయిన జి.విద్యాసాగర్ రెడ్డి గత 13 సంవత్సరాలుగా కొనసాగుతున్నారు. ఈయనతో పాటు ఉన్నత స్థాయిలో డి.జి.యం పోస్టుల్లో బి. విద్యసాగర్ రెడ్డి, నర్సింహ రెడ్డి, వెంకట్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, రాజరావ్, రవికుమార్, ఏర్రమల్ల.రమేష్ లాంటి అగ్రవర్ణ రిటైర్డ్ ఉద్యోగులు సంవత్సరాల తరబడి సంస్థలో పాతుకు పోయారని సమాచారం. రిటైర్డ్ ఉద్యోగులు ఏళ్లకు ఏళ్లు కొనసాగుతుండటం ద్వారా సంస్థలో వున్న సీనియర్ ఉద్యోగులకు ప్రమోషన్లు రాకపోవడటంతో పాటు వారి వేధింపుల వలన సుమారుగా 400 మంది ఉద్యోగులు రాజీనామా చేసి వెళ్లిపోవడం జరిగింది. ఇదే విషయమై పలుమార్లు పాత,కొత్త ప్రభుత్వానికి, మంత్రులకు, ముఖ్యమంత్రి ప్రజావాణిలో వరుసగా పిర్యాధులు వెళ్లిన నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. అంతే కాకుండా తమ హక్కుల గురించి ప్రశ్నించిన యస్సీ, ఎస్టీ బీసీ ఉద్యోగులను టార్గెట్ చేస్తూ వారిపై అక్రమ బదిలీలు, ప్రమోషన్ల నిరాకరణ, వారి ఫోన్లను ట్యాపింగ్ చేయడం, జీపీఎస్ ట్రాకింగ్ చేయడం, తప్పుడు ఫిర్యాదులు స్వీకరించి నిరాధార ఆరోపణలతో తప్పుడు వార్తలు వ్రాయించడం లాంటివి చేయడంతో వేధింపులు భరించలేక 6 గురు బాధిత ఉద్యోగులు జాతీయ రాష్ట్ర యస్సీ, ఎస్టీ, బిసి, మానవ హక్కుల కమిషన్ ,లేబర్ కమిషన్లను ఆశ్రయించడం జరగింది. అంతే కాకుండా స్త్రీ నిధి బోర్డుకు అప్పీల్ చేసుకోగా బోర్డు సభ్యులు సానుకూలంగా స్పందిస్తూ స్త్రీనిధి కి చాలా సంవత్సరాల నుండి సేవా చేస్తున్నారు కాబట్టి తొలగించడం కాకుండా మైనర్ పెనాలిటిని విధించి విధుల్లోకి తీసుకోవాలనే తీర్మానం చేయాలని చెప్పగా స్త్రీ నిధి యం.డి విద్యాసాగర్ రెడ్డి అట్టి ప్రతిపాదనను ఒప్పుకోకుండ ప్రిన్సిపల్ సెక్రటరీ మీటింగ్ కు రాలేదనే సాకుతో ఆ నిర్ణయాన్ని అమలుచేయలేదు. తదుపరి సమావేశంలో 15 మంది డైరెక్టర్లు సానుకులంగా స్పందించినా ప్రిన్సిపల్ సెక్రెటరీ ఒప్పుకోలేదని అప్పీల్ రిజెక్ట్ చేయడం జరిగింది. ఈ విధంగా యస్సీ, ఎస్టీ, బీసీ ఉద్యోగులను టార్గెట్ చేస్తున్నా విషయాన్ని మంత్రి సీతక్క దృష్టికి సంస్థ ఉద్యోగులు, ఎస్సీ ఎస్టీ, బిసి కుల సంఘాల బాధ్యులు తీసుకువెళ్ళారు. ఈ క్రమములో ప్రభుత్వం అన్ని శాఖలలో, బోర్డులు, కార్పొరేషన్లలో పాతుకు పోయిన విశ్రాంత అధికారుల వివరాలు సేకరించి తొలగించేందుకు రంగం సిద్ధం చేసిందని తెలిసింది, మంత్రిగారు స్పందిస్తూ స్త్రీ నిధిలోని రిటైర్డ్ ఉద్యోగుల తొలగింపు అనేది కూడా ప్రభుత్వం దృష్టిలో వుంది కానీ ఎలక్షన్ కోడ్ కారణంగా నిర్ణయం తీసుకోలేకపోతున్నాము, కోడ్ ముగిసిన వెంటనే చర్యలు వుంటాయని తెలియజేశారు. స్త్రీ నిధి పరపతి సహకార సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ జి.విద్యాసాగర్ రెడ్డి తొలగింపు అనివార్యం కావడంతో, కేవలం మేనేజింగ్ డైరెక్టర్గా తొలగించడమే కాకుండా ఆయన పీరియడ్లో జరిగిన స్త్రినిధి లావాదేవీలను, నిధుల మళ్లింపు, ఐబీ ఫండ్, నైబర్ హుడ్ సెంటర్లు, వి.ఎల్.ఇ కమిషన్, పాలకుర్తి టైలరింగ్, శిక్షణ కార్యక్రమాలలో జరిగిన ఖర్చులు, జనరల్ బాడీ సమావేశం ఖర్చులు, కొనుగోలు లాంటి వాటిపై విజిలెన్స్ విచారణ జరపించి చర్యలు తీసుకోవాలని గిరిజన, ప్రజా సంఘాల కోరుతున్నారు.

# చివరి గింజవరకు కొనేలా ప్రణాళిక



నిజామాబాద్,జిల్లాలో ధాన్యం సేకరణ నాలుగు రోజుల్లో పూర్తి చేయాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ శరత్ సూచించారు. వివిధ శాఖల అధికారులు,ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లు , రైస్‌మిల్లర్లతో సమీక్షించి ఆదేశాలు జారీచేశారు. ప్రణాళిక ప్రకారం రోజూవారి లక్ష్యం నిర్దేశిరచుకొని కొనుగోలు పక్రియ పూర్తి చేయాలన్నారు.ప్రతిరోజు 9వేల మెట్రిక్ టన్నుల మేర, నాలుగు రోజుల్లో కొనుగోళ్లు పూర్తిచేసేలా తహసీల్దార్లు, వ్యవసాయశాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారని కలెక్టర్ అన్నారు. పలు కేంద్రాల వద్ద ధాన్యం కాంటా చేయాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. రైతులకు పూర్తిస్థాయిలో మద్దతు ధర అందించి అన్ని విధాలుగా ఆదుకోవాలనే సంకల్పంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 4.33 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ ఎ.శరత్ వెల్లడించారు. చివరి గింజను సైతం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉన్నదన్నారు. ట్యాబ్ ఎంట్రీ సకాలంలో పూర్తయితేనే రైతులకు వేగంగా బిల్లుల చెల్లింపులు జరుగుతాయన్నారు. కొనుగోలు కేంద్రానికి కొంత తక్కువ పరిమాణంలో ధాన్యం తెచ్చిన ఓ రైతు ప్రత్యేకాధికారిని కలిసి గత మూడు రోజుల నుంచి తన ధాన్యాన్ని తూకం చేయడం లేదని ఫిర్యాదు చేయడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలావుంటే వరి కోశాక వరికొయ్యలను పొలాల్లో కాల్చడం ద్వారా అనేక నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని శాస్త్రవేత్తలు రైతులకు సూచిస్తున్నారు. ఒకటన్ను వరిగడ్డి కాల్చడం వల్ల 5.5 కిలోల నత్రజని, 2.3 కిలోల భాస్వరం, 25 కిలోల పొటాషియంతోపాటు 12కిలోల సల్ఫర్‌తోపాటు సేంద్రియ కార్బన్ సైతం కోల్పోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు. పంట అవశేషాలను నేలలో చేర్చినట్లయితే నేలకు సేంద్రియ కార్బన్, నత్రజని అంది నేల సారవంతంగా మారుతుంది. మండే అవశేషాల నుంచి వచ్చే వేడి నేలలో ఉష్ణోగ్రతను పెంచుతుంది. దీనివలన ప్రయోజనకరమైన సూక్ష్మజీవులు మరణిస్తాయి. నేల ఆరోగ్యం కాపాడాలంటే అవశేషాలను కాల్చేయడం సరికాదన్నారు. భూసారాన్ని బట్టి పంటల సాగు చేపడితే అధిక దిగుబడులు పొందడమే కాకుండా భూమిలోని పోషకాలు చాలాకాలం పంటలకు అందే అవకాశం ఉంటుంది. దీంతో మంచి ఫలితాలు వచ్చి రైతులు ఆర్థికంగా బలపడే అవకాశం ఉంటుంది. వేసవిలో పంటలు పూర్తిగా చేతికి వచ్చిన తర్వాత రైతు తన పంటపొలంలో వ్యవసాయశాఖ అధికారి సూచనల మేరకు భూసార పరీక్షలు చేయించాలి. దాని ఫలితం ఆధారంగా తదుపరి మూడేళ్లపాటు సాగు చేసుకోవచ్చు.విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరని సూచించారు. కేవలం అధీకృత డీలర్ షాపులో మాత్రమే కొనుగోలు చేయాలి. అనధికార వ్యక్తుల నుంచి కొనుగోలు చేయరాదు. విత్తనాలు కొనుగోలు చేసిన తరువాత బిల్లు (రసీదు) తప్పనిసరిగా తీసుకోవాలి. బిల్లులో విత్తనం లాట్ నెంబర్, ముగింపు కాలపరిమితి వివరాలు చూసుకోవాలి. బిల్లుపై రైతు సంతకంతోపాటు అధీకృత డీలర్ సంతకం ఉండాలి. పంటకాలం ముగిసేవరకు విత్తన ప్యాకెట్, రసీదు భద్రంగా దాచిపెట్టుకోవాలి. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు. ఏయే రకం విత్తనాలు కొనుగోలు చేయలో స్థానిక ఏఈవో, ఏవో సలహాలు తీసుకుంటే మరింత మంచిదన్నారు. మరికొద్దిరోజుల్లో వర్షాలు విస్తారంగా కురిసే అవకాశం ఉంది. సాగుకు ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులు అవగాహన కలిగి ఉండాలి. పంటపొలాల్లో ఎట్టి పరిస్థితిలో వరికొయ్యలు తగులబెట్టవద్దు. పొడిదుక్కుల్లో విత్తనాలు వేయవద్దు. గ్రామాల్లో ఎవరైనా విత్తనాలు విక్రయిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలి. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలతోనే రైతులు సాగుకు శ్రీకారం చుట్టాలని అన్నారు.

# 'ఉగ్రం..వీరం' మహాద్భుతం.. యాదాద్రిలో ఆధ్యాత్మిక గ్రంథం ఆవిష్కరణ



హైదరాబాద్,జన్మాన్తర సంస్కారం, విశేష పుణ్యఫలం ఉంటేనే మహా నృసింహ క్షేత్రమైన యాదాద్రిలో ఇలాంటి గ్రంథం ఆవిష్కరించే భాగ్యం కలుగుతుందని స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, ఈవో ఎ. భాస్కరరావు అన్నారు. బుధవారం సాయంత్రం యాదాద్రిలో ప్రముఖ రచయిత పురాణపండ శ్రీనివాస్ రచించిన ఉగ్రం.. వీరం గ్రంథాన్ని ఆవిష్కరించి, తొలిప్రతిని ప్రముఖ గాయకులు, లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీ ఫౌండర్ చైర్మన్ కొమండూరి రామాచారికి అందజేశారు.కాగా, అందమైన, అరుదైన, పవిత్రమైన శ్రీ లక్ష్మీ నృసింహ భగవానుని వర్ణభరిత చిత్రాలతో.. నరసింహస్వామి మహావిర్భావ రమణీయఘట్టంతో ప్రముఖ రచయిత ఏపీ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధికారిక మాసపత్రిక పూర్వ సంపాదకులు, శ్రీశైల దేవస్థానం ప్రత్యేక సలహాదారులు పురాణపండ శ్రీనివాస్ అమోఘ రచనా సంకలనంగా విశేష రచనతో అందించిన 'ఉగ్రం.. వీరం' గ్రంథాన్ని యాదాద్రి మహాపుణ్యక్షేత్ర ఉత్సవాల ప్రత్యేక వేదికపై స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, కార్యనిర్వహణాధికారి ఏ. భాస్కరరావు బుధవారం సాయంత్రం ఆవిష్కరించారు.గ్రంథ రచయిత , శ్రీశైల దేవస్థానం పూర్వ ప్రత్యేక సలహాదారులు పురాణపండ శ్రీనివాస్ మాట్లాడుతూ యాదాద్రి మట్టిని తాకినప్పుడు కలిగే అనుభూతి ఒక ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని , అభయాన్నిస్తుందని పేర్కొన్నారు. ఈ శ్రీకార్యానికి యాదాద్రి మహాక్షేత్ర ప్రధాన అర్చకులు నల్లంతీగల్ లక్ష్మీనరసింహాచార్యులు మంగళాశాసనం చేశారు. 'ఉగ్రం.. వీరం ' దివ్యగ్రంథాన్ని దేవస్థానం ఉప కార్యనిర్వహణాధికారి దోర్బల భాస్కరశర్మ పరిచయం చేశారు.లక్ష పుష్పార్చనలో పాల్గొన్న భక్తులకు, సహస్ర కలశాభిషేకంలో పాల్గొన్న దంపతులకు, వివిధ ప్రత్యేక దర్శనాల్లో పాల్గొన్న భక్తులకు, దాతలకు ఈ మహత్తర గ్రంథాన్ని ఆలయ సిబ్బంది ఉచితంగా అందజేయడం విశేషం. యాదాద్రిలో ఇంతటి మహోజ్వల గ్రంథం ఈ ఉత్సవాల్లో ఆవిష్కరించబడటం శ్రీ లక్ష్మీనృసింహుని పరిపూర్ణకటా క్షమని దేవస్థాన మరొక ప్రధాన ఆచార్యులు కాండూరి వెంకటాచార్యులు పేర్కొన్నది మంగళసత్యం .ఈ గ్రంథ నిర్మాణంలో నిస్వార్థంగా, అంకితభావంతో లక్ష్మీ నృసింహునికి అక్షరసేవగా ప్రచురణాభాగ్యం పొందిన ఆంధ్రప్రదేశ్ పూర్వ ఐ. టి . శాఖామంత్రి , టీఆరెస్ సీనియర్ నాయకులు పొన్నాల లక్ష్మయ్య , శ్రీమతి పొన్నాల అరుణాదేవి దంపతులకు భక్త బృందాలు కృతజ్ఞతలు ప్రకటించడం విశేషం.విమర్శల్ని విసిరి కొడుతూ వీసమెత్తు స్వార్థం లేకుండా ఇంతటి మహాకార్యాన్ని ఇన్ని ఊళ్లకు, ఇన్ని గుళ్లకు , ఇన్ని కళా సంస్థలకు అందించే శ్రీకార్యాన్ని మోస్తున్న అద్భుత వక్త , ప్రముఖ రచయిత పురాణపండ శ్రీనివాస్ వెనుక వున్న దైవబలానికి , అకుంఠిత దీక్షాదక్షతలకూ నమస్కరించాల్సి దేనంటున్నారు రసజ్ఞులైన విజ్ఞులు.యాదాద్రి, కదిరి, వేదాద్రి, సింహాచలం, ధర్మపురి, మంగళగిరి, అంతర్వేది, చేర్యాల, బీదర్, కోరుకొండ, అగిరిపల్లి, ఫణిగిరి ఇలా ఎన్నో మహా నారసింహ క్షేత్రాలన్నీ శ్రీ నృసింహ జయంతితో స్వాతి నక్షత్ర మంగళవేళ పరవశిస్తున్న సందర్భంలో %ౌ% యాదాద్రి ఉత్సవ సంరంభాల రెండవరోజున ప్రముఖ రచయిత పురాణపండ శ్రీనివాస్ పరమాద్భుత గ్రంథం ' ఉగ్రం వీరం ' ను ఆవిష్కరించడం అద్భుతఘట్టంగా యాదాద్రి అర్చక పండిత వర్గాలు అభినందనల మంగళాశాసనాలు వర్షిస్తున్నాయి. ఈ అక్షర యజ్ఞకార్యంలో ఈ ఈ దయాకర రెడ్డి, మహీపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బోల్తాపడ్డ మద్యం బాటిళ్ల లారీ

హైదరాబాద్: మద్యం బాటిళ్లతో వెళుతోన్న లారీ హైదరాబాద్ బోయిన్ పల్లి వద్ద బోల్తా పడింది. మద్యం బాటిళ్లు చెల్లాచెదురుగా అక్కడ పడిపోయాయి. వాటిని చూసిన కొందరు తీసుకెళ్లేందుకు గుమికూడారు. లారీ బోల్తా పడిన వెంటనే పోలీసులు అక్కడికి చేరుకోవడంతో వారి ప్రయత్నం ఫలించలేదు. లారీ డ్రైవర్, క్లీనర్, వైన్ షాప్ సిబ్బంది కూడా వచ్చారు. మరో వ్యాన్‌లో లిక్కర్ బాటిళ్లను తరలించారు. పోలీసులు బ్యారికేడ్లు ఏర్పాటు చేయడంతో బాటిళ్లు తీసుకెళ్లడం వీలు పడలేదు. లేదంటే ఆ మందు బాటిళ్లు మొత్తం మాయం

# మమత సర్కార్‌కు భారీ షాక్



కోల్‌కతా, లోక్‌సభ ఎన్నికల వేళ పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇటీవల ఉపాధ్యాయ నియామక కుంభకోణం కేసులో 26వేల మంది టీచర్ల ఉద్యోగాలు రద్దు చేసిన కలకత్తా హైకోర్టు బుధవారం మరో సంచలన తీర్పు వెలువరించింది. ఓబీసీలో పలు క్లాసులను కొట్టివేసింది. 2010 తర్వాత నుంచి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన అన్ని ఓబీసీ ధ్రువపత్రాలను రద్దు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. 2012 నాటి పశ్చిమ బెంగాల్ వెనకబడిన వర్గాల చట్టంలోని కొన్ని నిబంధనలు చట్టవిరుద్ధంగా ఉన్నాయంటూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ జరిపిన ద్విసభ్య ధర్మాసనం.. 2010–12 మధ్య రాష్ట్ర ప్రభుత్వం ఓబీసీ వర్గీకరణలుగా పేర్కొన్న 42 క్లాసులను కొట్టివేస్తున్నట్లు వెల్లడించింది. ఆ వర్గీకరణలు చట్టవిరుద్ధంగా ఉన్నాయని స్పష్టంచేసింది. అందువల్ల 2010 తర్వాత ఈ క్లాసుల కింద జారీ చేసిన ఓబీసీ సర్టిఫికెట్లన్నిం టిని రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది. 1993 నాటి వెనకబడిన వర్గాల చట్టానికి అనుగుణంగా కొత్త ఓబీసీ జాబితాను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. అయితే, ఈ క్లాసులతో జారీ అయిన ఓబీసీ ధ్రువపత్రాలతో ఇప్పటికే ప్రయోజనాలు పొందుతున్నవారు, ఆ రిజర్వేషన్ల కింద ఉద్యోగాలు చేస్తున్నవారిపై ఈ తీర్పు ఎలాంటి ప్రభావం చూపదని న్యాయస్థానం వెల్లడించింది. 1993లో చేసిన చట్టానికి విరుద్ధంగా పత్రాలు జారీ చేశారని న్యాయమూర్తులు తపబ్రత చక్రవర్తి, రాజశేఖర్ మంతాతో కూడిన హైకోర్టు ధర్మాసనం తమ తీర్పులో స్పష్టం చేసింది. అయితే, తమ ఉత్తర్వుల ప్రభావం ఇప్పటికే ఉద్యోగాలు, పథకాల లబ్ధి పొందిన వారిపై ఎటువంటి ప్రభావం చూపవని తెలిపింది. 2010కి ముందు 66 తరగతులుగా క్లాసిఫై చేసిన ఓబీసీల జోలికి తాము వెళ్లడం లేదని, పిటిషన్‌లో వాటిని సవాలు చేయలేదని ధర్మాసనం పేర్కొంది. హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అసంతృప్తి వ్యక్తంచేశారు. దీన్ని తాము అంగీకరించబోమని తెలిపారు. ఓబీసీ రిజర్వేషన్లకు సంబంధించి ఇంటింటి సర్వే నిర్వహించి బిల్లు తీసుకొచ్చాం. రాజ్యాంగానికి లోబడి తీసుకొచ్చిన ఈ బిల్లును శాసనసభ ఆమోదించింది. ఇప్పుడు భాజపా కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి దీన్ని నిలిపివేయాలని కుట్ర పన్నింది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com